క్లుప్తంగా

కవెవరంలో పిల్లల ఉచిత వైద్య శిబిరం



తెనాలిటౌన్: రూరల్ మండలం కవెవరంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం న్యూలైఫ్ చిల్డ్రన్ హాస్పటల్ తెనాలి వారి ఆధ్వర్యంలో పిల్లల ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. చిన్నారులకు డాక్టర్ రాధిక రాజశేఖర్ కుప్పా వైద్య పరీక్షలు జరిపారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్ రాజశేఖర్, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ కేటీఎస్ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

దళిత క్రిస్టియన్లపై అసెంబ్లీలో తీర్మానం హర్షణీయం



తెనాలిటౌన్: రాష్ట్రంలో బోయ, వాల్మీకి కులాలను ఎస్టీల జాబితాలో, దళిత క్రిస్టియన్‌లను ఎస్సీల జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం చేయడం హర్షణీయమని జైభీమ్ ఫెడరేషన్ వ్యవస్థాపకుడు కవెవరపు దేవానంద్ పేర్కొన్నారు. గంగానమ్మపేటలోని జైభీమ్ ఫెడరేషన్ కార్యాలయంలో ఆదివారం అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దేవానంద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు మేలు చేసే నిర్ణయాలు అద్భుతమన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు కొత్తపల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక భవనం ప్రారంభం



తెనాలిఅర్బన్: బుర్రిపాలెం రోడ్డులోని మహాప్రస్థానంలో నూతనంగా నిర్మించిన డాకా లక్ష్మిరెడ్డి, లక్ష్మమ్మ సామాజిక భవనాన్ని ఆదివారం మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త కొత్త సుబ్రహ్మణ్యం, కౌన్సిలర్ అడుసుమల్లి వెంకటేశ్వరరావు, మహాప్రస్థాన సేవా సమితి అధ్యక్షుడు డాకా సాంబిరెడ్డి, ప్రధాన కార్యదర్శి జెట్టి శివరామకృష్ణప్రసాద్, కోశాధికారి బండి సాంబశివరావు, నాయకుడు చదలవాడ శంకర్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సాయి ఆశ్రమంలో వృద్ధులకు అన్నదానం

తెనాలిటౌన్: గాంధీనగర్‌లోని షిరిడీ సాయి వృద్ధాశ్రమంలో శ్రీవెంకటేశ్వర సేవా కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం వృద్ధులకు అన్నదానం చేశారు. యోగ సభ్యులు యోపూరి గోపాలరావు, అనూష దంపతుల పెళ్లి రోజు సందర్భంగా సేవా కార్యక్రమం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని కవెవరం గ్రామ మాజీ సర్పంచ్ గంపల శివనాగేశ్వరరావు ప్రారంభించి మాట్లాడుతూ యోగ సభ్యులు పుట్టిన రోజు, పెళ్లి రోజు వేడుకలు వృద్ధుల సమక్షంలో జరుపుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్వీయోగ కన్వీనర్ ఎం.రమణయ్య, దీక్షిత, తేజసాయి నరసింహ, ఆశ్రమ నిర్వాహకులు సత్యనారాయణ, సునీత, పలువురు యోగసాధకులు పాల్గొన్నారు.

కొండ చర్చిలో ఆరాధన కూడిక



తెనాలిటౌన్: ఇస్లాంపేటలోని యేసయ్య ప్రార్థనా కొండ చర్చిలో ఆదివారం ప్రత్యేక ఆరాధన కూడికను నిర్వహించారు. పాల్ అండ్ లూక్ మెమోరియల్ మినిస్ట్రీస్ డైరెక్టర్ బ్రదర్ ఆనందన్న వాక్యోపదేశం చేశారు. యేసుక్రీస్తును, ఆయన శ్రమలను ధ్యానించడం ద్వారా అనేక మేలులు కలుగుతాయని తెలిపారు. రోగుల కోసం ప్రత్యేక స్వస్థత ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో చార్లెస్ వెస్లీ, పాల్ రాజశేఖర్, ప్రశాంత్‌బాబు, సీమోను, సంఘపెద్దలు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

తాడికొండ: ఆదివారం తాడికొండలో ధూళిపాళ్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కిషోర్ దంత వైద్యశాల, స్నేహిల్ యూత్ సంయుక్త ఆధ్వర్యంలో దంత వైద్యం, మాటలు సరిగా రాని చిన్నారులు 93 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు ధూళిపాళ్ల ఏసుబాబు, ధూళిపాళ్ల కిషోర్, బండ్ల కోటేశ్వరరావు, వైద్యులు డాక్టర్ శిరీష, డాక్టర్ కిషోర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- పట్టణ ఆర్యవైశ్య లీగల్ సెల్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం



ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిఅర్బన్: ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారానికి నూతనంగా ఏర్పాటు చేసిన లీగల్ సెల్ సభ్యులు కృషి చేయాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సూచించారు. తెనాలి పట్టణ ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘం, అనుబంధ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన తెనాలి పట్టణ ఆర్యవైశ్య లీగల్ సెల్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార మహోత్సవాన్ని బోసురోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో ముందుంటున్నారని పేర్కొన్నారు. పేద ఆర్యవైశ్యుల సమస్యలను పరిష్కరించడం, సూచనలు, సలహాలు అందించేందుకు లీగల్ సెల్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. లీగల్ సెల్ సభ్యులు బాధ్యతగా వ్యవహరిస్తూ భరోసా కల్పించాలని సూచించారు. ఆర్యవైశ్య సంఘాలు మరింత అభివృద్ధి చెందాలని అభిలాషించారు. అనంతరం లీగల్ సెల్ చైర్మన్‌గా నియమితులైన దరిశి శివకోటేశ్వరరావు, సలహాదారులు మద్ది మల్లికార్జునరావు, వైస్ చైర్మన్లు పొత్తూరి నాగేంద్రం, గ్రంధి జయరామ్, జవ్వాజి శ్రీనివాసరావు, కొత్తమాసు గురునాథబాబు, గోడవర్తి భాస్కరరావు, అప్పల కిషోర్, కోట కౌషిక్, సంకా ఆంజనేయులు, సంకా కోటేశ్వరరావు, సంకా చంద్రశేఖర్‌తో ఆర్యవైశ్య నాయకులు సాధు ప్రతాప్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం సభ్యులను ఘనంగా సన్మానించారు. తెనాలి పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు భాస్కరుని శ్రీనివాసరావు సభకు అధ్యక్షత వహించగా ప్రముఖ పారిశ్రామికవేత్త నూకల వేణు, తెనాలి పట్టణ ఆర్యవైశ్య సంఘాల కో–ఆర్డినేటర్లు మద్దాలి శేషాచలం, వివిధ సంఘాల నాయకులు కొల్లా గురునాథ గుప్తా, కూరపాటి రవికుమార్, కర్పూరపు రఘునాథ మూర్తి, ఆతుకూరి పూర్ణచంద్రరావు, చుండూరు సాయి, కొండవేటి లక్ష్మీపద్మావతి, చుండూరు వెంకట శివప్రసాద్, తూనుగుంట్ల సుబ్బారావు, పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

నరాల వ్యాధులపై అప్రమత్తత అవసరం



డాక్టర పవన్‌కుమార్‌ను సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

తెనాలిరూరల్: నరాల వ్యాధులపై అప్రమత్తత అవసరమని నిమ్స్ న్యూరో సర్జన్ డాక్టర్ బడుగు పవన్‌కుమార్ పేర్కొన్నారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కవిరాజు పార్కులోని వీజీకే భవనంలో ఆదివారం సాయంత్రం జరిగిన సమావేశంలో డాక్టర్ పవన్‌కుమార్ ముఖ్యఅతిథిగా మాట్లాడారు. వృద్ధాప్యంలో వచ్చే నరాల బలహీనతలు, మెదడులోని నరాల్లో రక్తం గడ్డ కట్టడం, రక్త ప్రసారానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వెన్నుపూస సమస్యల గురించి వివరించారు. ఎప్పటికప్పుడు వైద్యులను సంప్రదించి తగు వైద్య పరీక్షలు చేయించుకుంటూ అవసరమైన మందులు వాడాలని చెప్పారు. తేలికపాటి వ్యాయామం, నడకతో ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ పవన్‌కుమార్‌ను అసోసియేషన్ సభ్యులు సత్కరించారు. మొవ్వ సత్యనారాయణ, బొమ్మదేవర వెంకటేశ్వరరావు, సోమరౌతు నాగేంద్రయ్య, డాక్టర్ పసుపులేటి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఒకే జాతి, ఒకే భాష విధానంతో ప్రాంతీయ భాషలకు చేటు



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న అతిథులు

తెనాలిరూరల్: ఒకే జాతి–ఒకే భాష విధానంతో ప్రాంతీయ భాషల మనుగడ ప్రమాదకరంగా తయారవుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. జనసాహితి సంస్థ ఆధ్వర్యంలో కొత్తపేటలోని పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో ఆదివారం సాయంత్రం సదస్సు నిర్వహించారు. 'తెలుగు మాధ్యమం –ఎదుర్కొంటున్న సవాళ్లు' అన్న అంశంపై జరిగిన సదస్సులో పలువురు ప్రముఖులు మాట్లాడారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి నందివెలుగు ముక్తేశ్వరరావు మాట్లాడుతూ అటు తెలుగు, ఇటు ఇంగ్లిష్ రాని తరాలను తయారు చేస్తున్న పాలకుల విధానాలపై పోరాడాల్సిన అవసరముందన్నారు. తెలుగు భాషోద్యమం ఎదుర్కొంటున్న సవాళ్లపై ప్రసంగించారు. ఏలూరు ఆశ్రమ్ వైద్య కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ గుంటుపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ తెలుగు భాషను రక్షించుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో భాగంగా చందు నాగేశ్వరరావు రచించిన 500 కంద పద్యాల పుస్తకం, జనసాహితి ఆధ్వర్యంలో రూపొందించిన 'సృజనకు విత్తు–సొంత భాష' పుస్తకాలను అతిథులు ఆవిష్కరించారు. జనసాహితి అధ్యక్షుడు దివి కుమార్ అధ్యక్షత వహించగా, డాక్టర్ పిల్లి వాసు, పి.మధు, గిడుగు వెంకటేశ్వరరావు తదితరులు మాట్లాడారు. పలువురు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

రెడ్డి హాస్టల్‌లో కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్ ప్రారంభం



సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంగళగిరి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, మందపాటి శరత్‌రెడ్డి

నెహ్రూనగర్: విద్యార్థుల అభ్యున్నతి కోసం దాతలు ముందుకు వచ్చి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. నార్త్ అమెరికా తెలుగు అసోసియేషన్, అమెరికా ప్రవాసాంధ్ర దాతల ఆర్థిక సౌజన్యంతో నగరంపాలెంలోని రెడ్డి జనాభ్యుదయ మండలి(రెడ్డి) హాస్టల్‌లో కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్‌ను వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి, నాటా యూఎస్‌ఏ మందపాటి శరత్‌రెడ్డితో కలసి ఎమ్మెల్యే ఆర్కే ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ప్రస్తుత సాంకేతికకు అనుగుణంగా దాతలు అందిస్తున్న సాయాన్ని సద్వినియోగం చేసుకుని వృద్ధిలోకి రావాలని సూచించారు. కార్యక్రమంలో మందపాటి బాలకృష్ణారెడ్డి, సరస్వతి, సూరసాని వెంకటరెడ్డి, పడాల సుబ్బారెడ్డి, సీతారామ్‌ప్రసాద్ రెడ్డి, లేళ్ల పెద అప్పిరెడ్డి, వాకా వెంకటేశ్వరరెడ్డి, జె. సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజ ఆడిటోరియంలో కళాలయ మెలోడీస్ సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎ.వి. రత్నాజీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 19వ సినీ సంగీత విభావరి ప్రేక్షకుల్ని అలరించింది. కార్యక్రమంలో అన్నదాన సమాజ చైర్మన్ పోకల వసంత్ ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. గాయకులు పి. మొగిలి, ఈ. భరత్‌రెడ్డి, పి. గాయత్రీదేవి, వి.ఎస్.ఎస్. మల్లేశ్వరరావు, పావని అలనాటి పాటల్ని ఆలపించారు. అనంతరం కళాకారుల్ని సంస్థ నిర్వాహకులు సత్కరించారు.

నేడు 15వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

తెనాలిఅర్బన్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని 15వ వార్డు స్వరాజ్ థియేటర్ సమీపం నుంచి సోమవారం సాయంత్రం 6 గంటలకు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొనే కార్యక్రమంలో కౌన్సిలర్లు, ప్రభుత్వ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొనాలని కోరారు.

వైఎస్సార్ ఆసారా మూడో విడత లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ఉదయం 10 గంటలకు నందివెలుగు గ్రామంలోని బొద్దు వెంకట సుబ్బయ్య కల్యాణ మండపం, మధ్యాహ్నం 12 గంటలకు చినరావూరులోని కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొంటారని తెలిపారు.

చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

తాడేపల్లిరూరల్ : కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5న ఢిల్లీలో జరిగే కార్మిక కర్షక ర్యాలీని జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకరరావు పిలుపునిచ్చారు. ఆదివారం ఎంటీఎంసీ పరిధిలోని ప్రాతూరు గ్రామంలో రైతు నాయకులకు కరపత్రాలు పంపిణీ చేసి, ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతాంగ విధానాలకు వ్యతిరేకంగా.. కార్మిక చట్టాలను కాలరాస్తూ, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తూ పరిపాలనచేస్తోందని మండిపడ్డారు. బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఢిల్లీలో రైతులు, కార్మికులు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్మిక కర్షక నిరసన ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, డోకిపర్తి రాజేంద్రబాబు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డోకిపర్తి కోటయ్య, అంబేడ్కర్ యూత్ నాయకులు సంకూరు నాని, ఏసు తదితరులు పాల్గొన్నారు.

రాస్తారోకో చేసిన వారిపై కేసు నమోదు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్ ఎదురుగా రోడ్డు ప్రమాదంలో మరణించిన యువకుడి మృతదేహంతో శనివారం సాయంత్రం బంధువులు రాస్తారోకో చేశారు. వారిపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎం.లక్ష్మీనారాయణరెడ్డి ఆదివారం తెలిపారు. వేములూరిపాడు గ్రామానికి చెందిన మృతుడి బంధువులు 30 మంది రాష్ట్ర రహదారిపై ప్రజల, వాహనాల రాక పోకలకు ఆటంకం కలిగించినందుకు కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు.

మాదిగల అభ్యున్నతికి.. ప్రభుత్వం కృషి

మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు

తాడేపల్లిరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాదిగలకు గత ప్రభుత్వాలు ఇవ్వని ప్రాధాన్యం ఇచ్చారని, మాదిగల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు పేర్కొన్నారు. ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని ముగ్గురోడ్డులో మాదిగ కార్యాచరణ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఏర్పడిన సందర్భంగా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథి విచ్చేసిన కొమ్మూరి కనకారావు మాట్లాడుతూ.. కులాల వారీగా కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, అన్ని వర్గాల ప్రజలను సీఎం వైఎస్ జగన్ ఆదుకుంటున్నారన్నారు. కేబినేట్‌లో మాదిగ కమ్యూనిటీకి చెందిన తానేటి వనితకు హోం మినిస్టర్‌గా బాధ్యతలు అప్పజెప్పారని, అలాగే చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఎమ్మెల్సీని మాదిగలకు ఇచ్చారని గుర్తుచేశారు. రాబోయే కాలంలో సీఎం వైఎస్ జగన్ సారథ్యంలో మనందరికీ భవిష్యత్తు ఉంటుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ తాడేపల్లి పట్టణ ఎస్సీ సెల్ కన్వీనర్ ముదిగొండ ప్రకాష్, మాదిగ కార్యాచరణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జమ్మలమూడి సుధాకర్, కార్యదర్శి మనోజ్ కుమార్, కమిటీ మెంబర్లు పటికల యోహాను, నందిగం వీరస్వామి, ఆళ్లగడ్డ ఏసుదాసు, పల్లె ప్రభాకర్, సుధీర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని మహానాడులో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. దుండగులు బీరువా పగులగొట్టి బంగారం దోచుకెళ్లారు. తాడేపల్లి ఎస్‌ఐ వినోద్ వివరాల మేరకు.. మహానాడు 22వ లైన్‌లో నివాసం ఉన్న కొండూరు కామేశ్వరరావు తన భార్యతో కలసి శనివారం సాయంత్రం గుంటూరు వెళ్లారు. అతని కుమారుడు రమణ సాయంత్రం 6.30 సమయంలో తలుపునకు, గేటుకు తాళం వేసి బయటకు వెళ్లాడు. కామేశ్వరరావు గుంటూరు నుంచి ఇంటికి వచ్చి తలుపులు తీయగా వెనుక డోర్ తీసి ఉండటాన్ని గమనించాడు. వెంటనే బెడ్ రూమ్‌లోకి వెళ్లి చూడగా బీరువా పగలకొట్టి ఉంది. లాకర్‌లో ఉన్న 23 గ్రాముల బంగారం చోరీకి గురైనట్లు గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు.. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వినోద్ తెలిపారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించినట్లు చెప్పారు.

సుందరంగా శ్మశానవాటికలు



మహా ప్రస్థానాన్ని ప్రారంభిస్తున్న ఐటీసీ ఈడీ శ్రీధర్‌బాబు, జ్ఞాన ప్రసన్నగిరి స్వామి

ఫిరంగిపురం: అమ్మ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో శ్మశాన వాటికలను సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు ఐటీసీ ఈడీ అద్దంకి శ్రీధర్‌బాబు అన్నారు. వేమవరం గ్రామ శివారులోని శ్మశాన వాటికలో గుంటూరుకు చెందిన కె.ఘంటేశ్వరశర్మ, రత్నమాల దంపతుల జ్ఞాపకార్థం అల్లుడు శ్రీనివాసరావు నిర్మించిన మహాకాళ్, మహా ప్రస్థానం నూతన కెనాల్‌ను శ్రీధర్‌బాబు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీనియర్ జర్నలిస్ట్ ఎం.శ్రీనివాసరావు, అరుణ దంపతులు రూ.6లక్షలు కేటాయించడం అభినందనీయమన్నారు. ఉన్నత స్థానాల్లో ఉన్న ప్రతి ఒక్కరూ తమ గ్రామానికి ఎంతో కొంత ఉపయోగపడే పనులు చేయాలన్నారు. కార్యక్రమంలో అమ్మ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు జ్ఞాన ప్రసన్నగిరి స్వామి, ఎం.శ్రీనివాసరావు, చల్లా నరిసిరెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆర్థిక సాయం

తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని రేవేంద్రపాడుకు చెందిన ఓ వ్యక్తి గుండె పోటుతో మృతి చెందాడు. ఆ కుటుంబానికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ప్రగాఢ సానుభూతి తెలిజేశారు. రూ.10 వేల ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. ఆదివారం దుగ్గిరాల సర్పంచ్ పలుకూరి మేరమ్మ నగదును శృంగారపాటి భిక్షాలు కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ ఎం.వెంకట సుబ్బయ్య, స్థానికులు పి.శామ్యూలు, ఎస్. శంకర్, బోసు, నాగరాజు, లాజరు తదితరులు పాల్గొన్నారు.

కొలకలూరులో పారిశుద్ధ్య పనులు



ఎస్టీ కాలనీలో రోడ్ల వెంబడి ఉన్న చెత్తను తొలగిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థినులు

తెనాలిటౌన్: కొలకలూరు గ్రామంలో బాపట్ల వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థినులు నిర్వహిస్తున్న జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) నాల్గవ రోజుకు చేరింది. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్, ప్రొఫెసర్ ప్రసన్నకుమారి పర్యవేక్షణలో విద్యార్థినులు పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఉన్న పిచ్చిమొక్కలు, ముళ్ల కంప తొలగించి శుభ్రం చేశారు. రోడ్ల వెంబడి ఉన్న చెత్త, చెదారాలను తొలగించారు. అనంతరం గ్రామంలో దోమల నివారణ కార్యక్రమాన్ని చేపట్టి దోమలను ఎలా నివారించుకోవాలో గ్రామస్తులకు తెలియజేశారు. రంపం పట్టు, ఇంజన్ ఆయిల్ ఉపయోగించి ఉండలు ఎలా తయారు చేసుకోవాలో చూపించి, వాటిని దోమలు ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లో, దోమలు గుడ్లు పెట్టే ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. ఇలా చేయడం వల్ల దోమల లార్వా చనిపోయి వాటి గుడ్లు కరిగిపోతాయని గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ ప్రసన్నకుమారి, నాగలక్ష్మి, మేస్త్రి గణేష్, విద్యార్థినులు పాల్గొన్నారు.

పునరుత్థానంపై విశ్వాసం చూపాలి



వాక్యోపదేశం చేస్తున్న, సహాయ విచారణ గురువు కిషోర్‌బాబు

ఫిరంగిపురం: పునరుత్థానంపై ప్రతి ఒక్కరూ విశ్వాసంగా ఉండాలని సహాయ విచారణ గురువు చొప్పర కిషోర్‌బాబు అన్నారు. మండల కేంద్రంలోని బాల ఏసు దేవాలయంలో శ్రమ దినాలలో భాగంగా 5వ ఆదివారం దివ్య పూజ బలి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సహాయ విచారణ గురువు కిషోర్ బాబు వాక్యోపదేశం చేశారు. పునరుద్ధానం అనగా క్రీస్తు ప్రభువునకు సన్నిహితంగా ఉండటం అని చెప్పారు. శ్రమ దినాలలో క్రీస్తునకు దగ్గరగా ఉంటూ ఆయన నామాన్ని తలచుకోవాలన్నారు. పునరుత్థానం తరువాత 40 రోజుల పాటు తన శిష్యులకు క్రీస్తు దర్శనాన్ని ఇచ్చారని తెలిపారు. ఆనాటి దివ్య గ్రంథాలు పునరుత్థానం గురించి విశేషంగా ప్రస్తావించాయన్నారు. పునరుత్థానం అమరత్వాన్ని తెలియజేస్తుందని, మోక్షానందాన్ని అందిస్తుందని చెప్పారు.

ఆర్‌అండ్‌బీ స్థలాల్లో ఆగని ఆక్రమణలు

నిర్మాణాలు చేపట్టి.. అద్దెలకు ఇస్తున్న వైనం



ఆర్‌అండ్‌బీ స్థలాన్ని ఆక్రమించి ఇనుప రేకులతో నిర్మించిన షెడ్డు

మంగళగిరి: నగర పరిధిలోని యర్రబాలెం డాన్ బాస్కో ఉన్నత పాఠశాల ఎదుట గల ఆర్‌అండ్‌బీ స్థలంలో ఆక్రమణలు ఆగడం లేదు. గతంలో కొందరు ఆక్రమించగా ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) సూచనలతో ఆర్‌అండ్‌బీ, నగర పాలక సంస్థ అధికారులు తొలగించారు. కొంత కాలంగా అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో తిరిగి యథేచ్ఛగా కబ్జాదారులు ఆక్రమణలకు తెగబడుతున్నారు. కొందరు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి గుడిసెలు, రేకుల షెడ్ల నిర్మాణాలు చేపట్టి.. అద్దెకు ఇచ్చి ఆదాయం పొందుతుండటం గమనార్హం. మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థగా ఆవిర్భవించిన నేపథ్యంలో స్థలాల ధరలు పెరగడంతో ఆక్రమణ దారుల కన్ను ప్రభుత్వ స్థలాలపై పడింది. రెవెన్యూ, పట్టణ ప్రణాళికా విభాగం, ఆర్‌అండ్‌బీ అధికారులు ఒకరిపై ఒకరు ఆక్రమణలను అడ్డుకోవడం తమ పరిధి కాదని తప్పుకుంటుండటం వారికి అలుసుగా మారింది. ప్రధానంగా నవులూరుకు చెందిన టీడీపీ నాయకులతో పాటు యర్రబాలేనికి చెందిన మాజీ ప్రజాప్రతినిధి అనుచరులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు టీడీపీ పాలనలో ఆక్రమణలకు పాల్పడి ఆక్రమించిన స్థలాలను విక్రయించి సొమ్ము చేసుకున్నారనే ఆరోపణలున్నాయి. తిరిగి వారే మళ్లీ రంగంలోకి దిగి తిరిగి ఆక్రమణలకు శ్రీకారం చుట్టడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుని ప్రభుత్వ స్థలాల్లోని ఆక్రమణలను పూర్తిగా తొలగించి ఆక్రమణ దారులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు. ఆక్రమణల విషయమై ఆర్‌అండ్‌బీ డీఈ చెన్నయ్య వివరణ కోరగా గతంలో ఆక్రమణలను తొలగించడం జరిగిందన్నారు. ఆర్‌అండ్‌బీ స్థలాలను ఆక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. రెవెన్యూ, నగర పాలక సంస్థ అధికారులకు ఆర్‌అండ్‌బీ స్థలాల్లో ఆక్రమణలు తొలగించాలని కోరతామని తెలిపారు.

సీఎంను విమర్శించే అర్హత ఆమెకు లేదు

- పార్టీకి వెన్నుపోటు పొడిచిన శ్రీదేవి
- తాడికొండ సమన్వయకర్త సురేష్‌కుమార్



కత్తెర సురేష్ కుమార్

తాడికొండ: వైఎస్సార్ సీపీకి, నియోజకవర్గంలోని నాయకులకు వెన్నుపోటు పొడిచిన ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని విమర్శించే అర్హత లేదని తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం గుంటూరు భారత్ పేటలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అర్హత లేకున్నా స్థానికురాలిగా నియోజకవర్గానికి ఏదో మేలు చేస్తుందని, పార్టీలో సముచిత స్థానం కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని శ్రీదేవి విమర్శించడం నీతిమాలిన తనానికి నిదర్శనమని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను రాజకీయంగా, సామాజికంగా అందలమెక్కించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. అంతటి మహనీయుడిపై అవాకులు, చవాకులు పేలడం సరికాదన్నారు. దాచుకో, దోచుకో, పంచుకో అనే పదాలు ఎవరికి వర్తిస్తాయో అందరికీ అర్థమైందన్నారు. ఉండవల్లి శ్రీదేవి ఓ సారి వెనక్కి తిరిగి చూసుకుంటే స్పష్టంగా కనిపిస్తుందన్నారు. అసెంబ్లీ సాక్షిగా మాట్లాడుతూ.. తన గుండె లబ్ డబ్ బదులు జగన్... జగన్.. జగన్ అని కొట్టుకుంటుందని, పదవి ఉన్నంత వరకు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వెంటే తన గుండె చప్పుడు ఉంటుందని చెప్పిన ఉండవల్లి శ్రీదేవి అవినీతి, అక్రమాలకు పాల్పడి పార్టీ నుంచి బర్తరఫ్ చేసిన తరువాత విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. నియోజక వర్గంలో అంగన్ వాడీ ఆయాల నుంచి నామినేటెడ్ పోస్టుల వరకు ఆమె ఎంతెంత వసూలు చేసిందో అందరికీ తెలిసిన బహిరంగ రహస్యమేనని ఆరోపించారు. ఎన్నికల సమయంలో కార్యకర్తల నుంచి లక్షల రూపాయలు తీసుకొని ఎగ్గొట్టి పత్రికలకు ఎక్కిన సంగతి మర్చిపోయారా అని ప్రశ్నించారు. ఇళ్ల స్కామ్‌పై ఉండవల్లి శ్రీదేవి మాట్లాడే తీరు దొంగే దొంగా..దొంగా అని అరచినట్లుందన్నారు. నియోజకవర్గంలో ఇళ్ల స్కామ్ చేసింది ఎవరు..? దాని ద్వారా కోట్ల రూపాయల లబ్ధి పొందింది ఎవరు..? అనేది శ్రీదేవి తన అంతరాత్మనను ప్రశ్నించుకుంటే సమాధానం దొరుకుతుందన్నారు.

పెట్రోల్ బంక్‌లో వ్యక్తిపై దాడి

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని నులకపేటలోని ఓ పెట్రోల్ బంకులో పనిచేసే ఓ వ్యక్తిపై కొందరు యువకులు దాడి చేసిన ఘటన ఆలస్యంగా ఆదివారం వెలుగులోకి వచ్చింది. తాడేపల్లికి చెందిన దొంతిరెడ్డి జనార్దన్‌రెడ్డి పెట్రోల్ బంకులో నాలుగు రోజుల క్రితం రాత్రి సమయంలో విధులు నిర్వహిస్తున్నాడు. ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై అక్కడికి వచ్చారు. పెట్రోల్ పట్టించుకునేందుకు.. ఆన్‌లైన్ స్కాన్ ద్వారా నగదు చెల్లిస్తామని చెప్పారు. స్కాన్ చేసిన అనంతరం పెట్రోల్ పడతానని జనార్దన్‌రెడ్డి చెప్పాడు. పెట్రోల్ పట్టకుండా స్కాన్ ఎలా చేస్తామంటూ యువకులు వాదనకు దిగారు. ఈ క్రమంలో ఆ యువకులు అతనిపై ఒక్కసారిగా దాడికి పాల్పడ్డారు. ఇంతలో మరికొంతమంది వచ్చి జనార్దన్‌రెడ్డిని కొట్టడంతో అతని తలకు తీవ్ర గాయమైంది. తోటి సిబ్బంది గాయపడిన జానార్దన్‌రెడ్డిని ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.